సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం : 4 : జూన్ : 2024



సోమశిలలో 7.368 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 7.368 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 59 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.73,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,619
3శాతం జీఎస్టీతో	రూ.6,818
నవర (8గ్రా)	రూ.54,544



రంగడి ఆలయంలో వసంతోత్సవాలు

నెల్లూరులోని రంగనాయకులపేటలో కొలువైన రంగనాథుడి ఆలయంలో వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. ఉభయదేవేరులకు తిరుమంజనం నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 330

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 330 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 695 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 588 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 107 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.330, కనిష్టంగా రూ.205 ధర పలకగా, సగటున రూ. 290.16 ధర లభించిందన్నారు. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 692 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 692 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 779 బేళ్లు రాగా వాటిలో 692 బేళ్లను విక్రయించామన్నారు. వేలంలో 87,020 కిలోల పొగాకును విక్రయించగా రూ.23954506 వ్యాపారం జరిగింది. కిలో గరిష్ఠంగా రూ.330, కనిష్ఠంగా రూ. 205 ధర లభించింది. సగటు ధర రూ. 275.28గా నమోదైంది. వేలంలో 20 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

పొదలకూరు: ఎన్జీరంగా విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు పొదలకూరు ఏజీ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్, ప్రధాన శాస్త్రవేత్త ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఏజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. కోర్సుల కాలవ్యవధి రెండు, మూడేళ్లు ఉంటుందన్నారు. కోర్సుల్లో ప్రవేశానికి టెన్త్ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఇంటర్ ఫెయిల్ లేదా మధ్యలో ఆపేసిన వారు కూడా అర్హులుగా పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారు అనర్హులుగా తెలిపారు. అభ్యర్థులకు 15 నుంచి 22 ఏళ్ల వయస్సు ఉండాల్సిందిగా వెల్లడించారు. పదిలో వచ్చిన మార్కుల ఆధారంగా కోర్సుల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుందని, అభ్యర్థులు ఆన్‌లైన్లో మాత్రమే దరఖాస్తులు సమర్పించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా ఆసక్తి ఉన్న వారు http:// angrau. ac. in ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తులు సర్పించుకోవాల్సిందిగా సూచించారు.

పొగాకు విత్తనాలకు ఇండెంట్ పెట్టుకోండి


మర్రిపాడు: డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలో 2024–25 పంట కాలానికి సీటీఆర్ఐ ద్వారా పొగాకు విత్తనాలను సరఫరా చేసేందుకు పొగాకు బోర్డు కమర్షియల్ పొగాకు విత్తనాల కోసం ఇండెంట్ నమోదు చేసుకోవాలని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ సోమవారం తెలిపారు. పొగాకు రైతులకు ఒక బ్యారెన్‌కు 500 గ్రాముల చొప్పున ఇస్తారని తెలిపారు. కమర్షియల్ నారుమడికి సంబంధించిన రైతులు మాత్రమే పొగాకు విత్తనాల కోసం సూపర్‌వైజర్‌ను సంప్రదించాలని కోరారు.

పింఛన్ల కోసం పడిగాపులు



పింఛను కోసం పడిగాపులు పడుతున్న లబ్ధిదారులు

మనుబోలు: మనుబోలులోని మినీ బ్యాంకు వద్ద సోమవారం పింఛన్ కోసం లబ్ధిదారులు బారులు తీరారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో పింఛను మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరిగి పింఛను తెచ్చుకోవాల్సి వస్తుంది. ఉదయం 9:30 గంటలకు మినీ బ్యాంకు తెరుచుకుంటే 8 గంటల నుంచే లబ్ధిదారులు అక్కడ పడిగాపులు పడుతున్నారు. గతంలో వలంటీర్లే నేరుగా ఇళ్లకు వచ్చి పింఛను ఇచ్చే వారని ఇప్పుడు ఇప్పుడు వాళ్లను తొలగించడంతో తాము బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందని పింఛనుదారులు వాపోతున్నారు.



జడ్జిమెంట్ డే

తీవ్ర ఉత్కంఠ రేపుతున్న ఫలితాలు

- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్
- తొలి ఫలితం నెల్లూరు సిటీ
- చివరగా ఉదయగిరి, కోవూరు ఫలితాలు
- అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్
- గెలుపుపై బలమైన విశ్వాసంతో వైఎస్సార్‌సీపీ
- ఓటమి సాకుల కోసం టీడీపీ అభ్యర్థుల అన్వేషణ
- కిటకిటలాడుతున్న సింహపురి

ప్రజా తీర్పు ప్రకటితం కావడానికి కొన్ని గంటలే సమయం మిగిలింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం యావత్ జిల్లా ప్రజలు ఇంకా తెల్లార లేదే అన్నట్లు నరాలు తెగే తీవ్ర ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. గెలుపుపై వైఎస్సార్‌సీపీ బలమైన విశ్వాసంతో ఉంటే.. టీడీపీ దింపుడు కల్లాం ఆశతో ఉంది. ఈ ఎన్నికలు టీడీపీకి జీవన్మరణ సమస్య కావడంతో ప్రజాబలం లేని ఆ పార్టీ కేవలం ధన బలంతో ఎన్నికల ఎన్నికల రణరంగంలో పోరాడింది. ఓటమి పాలైతే సాకులు వెతుక్కుంటున్నారు. ఇప్పటికే సింహపురి జిల్లాలోని నియోజకవర్గాలకు చెందిన పార్టీల అభ్యర్థులు, ముఖ్య నేతలు, ఏజెంట్లతో కిటకిటలాడుతోంది.



నెల్లూరులో మోహరించిన రాజకీయ పార్టీలు

సార్వత్రిక ఎన్నికల ఆఖరి ఘట్టం కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం జరగనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రం సింహపురి కిటకిటలాడుతోంది. జిల్లాలోని 8 అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ప్రధాన పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు, నాయకులు, ముఖ్య కార్యకర్తలు సోమవారం సాయంత్రానికే మోహరించారు. ప్రధానంగా ఆయా పార్టీల ఏజెంట్లు ఉదయం 6 గంటలే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉండడంతో ముందుగానే నెల్లూరుకు చేరుకున్నారు. మరో పక్క కౌంటింగ్‌కు భారీ భద్రత కల్పిస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు మోహరించాయి.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మంగళవారం.. బిగ్ డే. ఐదేళ్ల ప్రభుత్వానికి తమ ఓటుతో ఇచ్చిన జడ్జిమెంట్ మరి కొన్ని గంటల్లో వెలువడనుంది. కౌంటింగ్ ప్రక్రియ కోసం జిల్లా ప్రజలు క్షణం ఒక యుగంగా గడుపుతున్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. దాదాపు 1110 మంది సిబ్బందితో కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తుండగా, మరో సుమారు 2 వేల మంది పోలీసులు, ప్రత్యేక దళాలతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ పర్యాయం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మధ్య 21 రోజులకు పైగా సమయం ఉండడంతో ఎక్కడ చూసినా గెలుపోటములపై విస్తృతంగా చర్చలు సాగాయి. ఇప్పటి వరకు సాగిన చర్చలు, అంచనాలు నేడు తేటతెల్లం కానున్నాయి.


తొలి ఫలితం నెల్లూరు సిటీ

కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యాక జిల్లాలో తొలి ఫలితం 2 గంటలకు నెల్లూరు సిటీ నియోజకవర్గం వెలువడనుంది. ఆఖరుగా ఉదయగిరి, కోవూరు నియోజకవర్గాల ఫలితాలు 4 గంటలకు వెలువడనున్నాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ లెక్కన కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లను బట్టి రౌండ్లు ఉంటాయి. 14 టేబుల్స్ 14 ఈవీఎంలు ఒక రౌండ్‌గా లెక్కిస్తారు. వీవీప్యాట్లలోని ఓట్ల లెక్కింపు సాయంత్రం 4 గంటలకు ముగిసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రతి రౌండ్‌కు ర్యాండమ్‌గా రెండు వీవీ ప్యాట్లను ఎంపిక చేసి అందులోని ఓట్ల స్లిప్‌లతో ఆ ఈవీఎంల్లో పోలైన ఓట్లతో సరిపోల్చనున్నారు.

ఉదయం 6 గంటలకే ఏజెంట్లు సన్నద్ధం

రాజకీయ పార్టీల నుంచి ఏజెంట్లు ఉదయం 6 గంటల కల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి సిద్ధమవుతున్నారు. తాజా ఎన్నికల కమిషన్ సోమవారం ప్రతి టేబుల్‌కు రెండో ఏజెంట్‌ను కూడా నియమించుకోవచ్చని చెప్పింది. ఏజెంట్లు టీ, టిఫిన్, భోజనం, రెస్ట్‌రూమ్‌లకు వెళ్లడానికి అనువుగా రెండో ఏజెంట్‌కు అనుమతి ఇచ్చింది. ఆయా పార్టీలు తమ ఏజెంట్లను నియమించుకునేందుకు మంగళవారం 8 గంటల వరకు కూడా అనుమతి ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఆయా పార్టీలు మరికొందరు ఏజెంట్లను నియమించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంల తరలింపు నుంచి చివరగా డిక్లరేషన్ అందుకునే వరకు ఏజెంట్లు తప్పనిసరిగా కౌంటింగ్ కేంద్రాల్లో ఉండాలని ప్రధాన రాజకీయ పార్టీలు దిశా నిర్దేశం చేసిన క్రమంలో అభ్యర్థులు ఆ మేరకు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరో వైపు ఇండిపెండెంట్ అభ్యర్థుల ఏజెంట్ల పాసులకు డిమాండ్ బాగా ఉంది. కౌంటింగ్ కేంద్రాల్లో ఎక్కువ మంది ఏజెంట్లు ఉంచడానికి ఇండిపెండెంట్ పాస్‌లను కొందరు తీసుకుని వారి పార్టీ కార్యకర్తల పేరుతో వచ్చేలా చూసుకుంటున్నారు.

అభ్యర్థుల్లో టెన్షన్



తీవ్ర ఉత్కంఠత రేపుతున్న ఈ ఎన్నికల ఫలితాలపై ఇప్పటి వరకు రెండు ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపోటములపై బేరిజు వేసుకుని స్పష్టమైన అవగాహనతో ఉన్నాయి. ఈ క్రమంలో లక్షల మంది ప్రజల తీర్పులో జిల్లాలో ఎలా ఉండబోతుంది. ఎవరికి పూర్తి అనుకూలంగా ఉంటుంది. ఎవరిని విజయం వరిస్తుందనే దానిపై ఆసక్తికర చర్చలు సాగుతూనే ఉన్నాయి. ఇక వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బలమైన విశ్వాసంతో ఉన్నారు. ఐదేళ్ల పాటు ప్రజాక్షేత్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాభివృద్ధి పాలనతో మరో మారు ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టనున్నారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థులు అయితే కొన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే పూర్తిగా చేతులెత్తేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా పనిచేయడంతో పాటు ఎక్కడా సమస్యలు రాకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక రెండు రాజకీయ పార్టీల అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు అనుసరించాల్సిన విధి విధానాలు, ఇతర అంశాలపై సమావేశాలు నిర్వహించి ఏజెంట్లకు అవగాహన కల్పించారు. జిల్లాలో కచ్చితంగా క్లీన్‌స్వీప్ చేస్తామని వైఎస్సార్‌సీపీ ధీమాగా ఉంటే.. దీనికి అనుగుణంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో జిల్లాలో వైఎస్సార్‌సీపీకి ప్రజలు పట్టం కడుతారని ప్రకటించాయి. అభ్యర్థులు అందరూ బూత్‌ల వారీగా పోల్ అయిన ఓట్లను ప్రామాణికంగా తీసుకుని అంచనాలు వేశారు. ఇక టీడీపీలో కొందరు అభ్యర్థులు అయితే ముందే ఓటమికి సాకులు వెతుక్కునే పనిలో ఉన్నారు. పోలింగ్ ముందే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు పూర్తిగా చేతులెత్తేయటంతో స్పష్టమైన అవగాహన వచ్చింది.

నియోజకవర్గాల వారీగా ఈవీఎంల కౌంటింగ్ వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్లు	కౌంటింగ్ ముగిసే సమయం (పీఎం)
కందుకూరు	271	14	20	3.00
కావలి	314	14	23	4.00
ఆత్మకూరు	278	14	20	3.00
కోవూరు	324	14	24	4.00
నెల్లూరు సిటీ	248	14	18	2.00
నెల్లూరురూరల్	285	14	21	3.00
ఉదయగిరి	323	14	24	4.00
సర్వేపల్లి	284	14	21	3.00
మొత్తం	2,327	112		

అంతా అప్రమత్తం



ఉమేష్‌చంద్ర హాలులో పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

- కౌంటింగ్‌కు పటిష్ట భద్రతా ఏర్పాట్లు
- సిటీలో ట్రాఫిక్ దారి మళ్లింపు

నెల్లూరు (క్రైమ్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఓట్ల లెక్కింపు జరిగే కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. సీఐఎస్‌ఎఫ్, ఏపీఎస్పీ, సివిల్, ఏఆర్, స్పెషల్ పార్టీ, హోంగార్డులతో మొత్తంగా 650 మందికి పైగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం నుంచే కౌంటింగ్ కేంద్రంతో పాటుగా పరిసర ప్రాంతాలన్నింటిని పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు.

144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలు

కౌంటింగ్ కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్‌ను అమల్లోకి తీసుకువచ్చారు. నలుగురు కన్నా ఎక్కువ మంది గుంపులుగా ఉండరాదు. కౌంటింగ్ కేంద్రానికి కిలో మీటర్ దూరం వరకు నిషేధాజ్ఞలు విధించారు. అభ్యర్థులు, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, ఆర్‌ఓల అనుమతి పొందిన మీడియా ప్రతినిధులను మినహా ఇతరులెవరికి కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన అనంతరమే లోనికి అనుమతిస్తారు. ఈ నెల 6వ తేదీ వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అభ్యర్థుల ఇళ్లు, పార్టీ కార్యాలయల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అభ్యర్థులకు భద్రతను ఏర్పాటు చేశారు.

300కుపైగా పోలీసు పికెట్లు ఏర్పాటు

జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో 300కుపైగా పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గస్తీని ముమ్మరం చేస్తున్నారు. ఆయా ప్రాంత పోలీసు అధికారులు, సిబ్బందితో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసి రౌండ్‌ది క్లాక్ గస్తీని కట్టుదిట్టం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, బాణసంచాలు కాల్చడాన్ని నిషేధించారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె. ఆరిఫ్ హఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి కౌంటింగ్ వేళ చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సోమవారం సాయంత్రం నుంచి 5వ తేదీ ఉదయం వరకు డ్రైడేను నిక్కచ్చిగా అమలు చేయాలన్నారు. నాకాబందితో పాటుగా లాడ్జీలు, హోటల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు, బయట వ్యక్తులు ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే అనుమతించాలన్నారు. అక్కడ అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులను వెంటనే పోలీసుస్టేషన్‌కు తరలించాలని చెప్పారు. అందరూ సమయపాలన పాటించాలని, ప్రతి ఒక్కరూ ఐడీ కార్డు, డ్యూటీ పాస్ పోర్టులతో నిర్దేశిత ప్రాంతాల్లో విధులు నిర్వహించాలన్నారు. అన్నీ శాఖలను సమన్వయం చేసుకుని కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వాహనాలు దారిమళ్లింపు

కౌంటింగ్‌కు వచ్చే నాయకులు, ఏజెంట్లకు సంబంధించిన కార్లు, బైక్‌లు, ఇతర వాహనాలను కనుపర్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో పార్కింగ్ చేయాలి. అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో వారిని కౌంటింగ్ కేంద్రం వద్దకు తీసుకెళ్తారు. కౌంటింగ్ నేపథ్యంలో నెల్లూరు నగర, రూరల్ ప్రదేశాల్లో పోలీసు అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

- ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల మీదుగా కనుపర్తిపాడు వెళ్లే మార్గంలో రాకపోకలను నిషేధించారు
- గొలగమూడికి వెళ్లే వారు జాతీయ రహదారి మీదుగా కాకుటూరు నుంచి వెళ్లాల్సి ఉంటుంది.
- గూడూరు నుంచి నెల్లూరు నగరంలోకి వచ్చే ప్రయాణికులు అయ్యప్పగుడి మీదుగా వెళ్లాలి
- కావలి నుంచి నెల్లూరు నగరంలోకి వచ్చే ప్రయాణికులు మెడికవర్ హాస్పిటల్ నుంచి నగరంలోకి చేరుకోవాలి
- మినీబైపాస్ నుంచి జాతీయ రహదారి మీదకు వెళ్లేందుకు సుందరయ్యకాలనీ నుంచి మెడికవర్ హాస్పిటల్ వరకు అనుమతి లేదు.
- నేషనల్ హైవేపై దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, లారీలకు ఎలాంటి ఆంక్షలు లేవు.

ఈసీఐ మార్గదర్శకాల మేరకే కౌంటింగ్ ప్రక్రియ



సమావేశానికి హాజరైన పలు నియోజకవర్గాలకు చెందిన రిటర్నింగ్ అధికారులు తదితరులు



మాట్లాడుతున్న కౌంటింగ్ అబ్జర్వర్ నితిన్‌సింగ్ బదారియా, కలెక్టర్ హరినారాయణన్

- ఆలస్యం లేకుండా రౌండ్ల వారీగా ఫలితాలను ప్రకటించాలి
- ఓట్ల లెక్కింపునకు ముందు కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కల్పించండి
- కౌంటింగ్ అబ్జర్వర్ నితిన్‌సింగ్‌బదారియా

నెల్లూరు (బారకాసు): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కౌంటింగ్ సిబ్బంది భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకే విధులు నిర్వర్తించాలని కోవూరు, ఉదయగిరి, నెల్లూరు సిటీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పరిశీలకులు నితిన్‌సింగ్‌బదారియా స్పష్టం చేశారు. సోమవారం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కౌంటింగ్ అబ్జర్వర్ సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ఎటువంటి కారణాలు లేకుండా ఓట్ల లెక్కింపు ఆలస్యం కాకూడదని, ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలను తప్పకుండా పాటిస్తూ ఓట్ల లెక్కిపు విధులు నిర్వహించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు రౌండ్ల వారీగా ఫలితాలు నమోదు చేసి ప్రతి రౌండ్‌కు అబ్జర్వర్ ఆమోదం పొందిన తర్వాతనే ఎన్నికల సంఘానికి ఫలితాలు పంపాలని ఆర్వోలకు సూచించారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు కౌంటింగ్ ఏజెంట్లకు ఓట్ల లెక్కింపు పద్ధతిపై క్లుప్తంగా అవగాహన కల్పించాలని ఆర్వోలకు సూచించారు. కౌంటింగ్ సమయంలో కౌంటింగ్ ఏజెంట్ల సందేహాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో 13ఏ, బ్యాలెట్ పేపర్ల స్క్రూటినీలో ఈసీఐ నిబంధనలు పాటిస్తూ లెక్కింపు చేపట్టాలన్నారు. ఈవీఎంల లెక్కింపు సమయంలో కౌంటింగ్ ఏజెంట్ల సందేహాలకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది అందరూ జాగ్రత్తగా కౌంటింగ్ విధులు నిర్వహించి కౌంటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నెల్లూరు సిటీ, కోవూరు, ఉదయగిరి రిటర్నింగ్ అధికారులు వికాస్‌మర్మత్, సేతుమాధవన్, ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లెక్కింపునకు సర్వసన్నద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- నేటి ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల ఏర్పాటు
- కౌంటింగ్ కేంద్రానికి చేరిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాణణన్ తెలిపారు. సోమవారం సాయంత్రం కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ ఏర్పాట్లను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 8 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 7,63,894 పురుషుల ఓట్లు, 7,84,219 మహిళల ఓట్లు, ఇతరుల ఓట్లు 70 మొత్తం కలిపి 15,48,183 ఓట్లు పోలైనట్లు కలెక్టర్ వెల్లడించారు. కౌంటింగ్ అబ్జర్వర్లు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఎప్పటికప్పుడు ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడించేందుకు ప్రియదర్శిని కౌంటింగ్ కేంద్రంలో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పాత్రికేయులకు ఎన్నికల సంఘం జారీ చేసిన మీడియా పాసులు అందించామని, ప్రతి ఒక్కరూ తమ పాస్‌ను తప్పకుండా తీసుకురావాలని, పాస్ ఉన్న వారినే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. పాత్రికేయులందరూ తమ సెల్‌ఫోన్లను మీడియా కేంద్రంలోనే ఉంచుకోవాలని, కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు సెల్‌ఫోన్లు పూర్తి నిషేధమన్నారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, టీ, స్నాక్స్, వంటి భోజన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత కల్పించామని, పరిసరాల్లో సైతం నిరంతరం పోలీసుల భద్రతను పర్యవేక్షిస్తున్నామని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని ఎస్పీ అన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సజావుగా కౌంటింగ్ కేంద్రం మూడంచెల పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పోలింగ్ రోజున ఎటువంటి బందోబస్తు చర్యలు చేపట్టామో అదే తరహాలో కౌంటింగ్ రోజున స్టేట్, ఆర్మ్‌డ్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ వరకు మాత్రమే పార్కింగ్ అనుమతి ఉన్నట్లు చెప్పారు. అబ్జర్వర్లు, అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్ల వాహనాలకు మాత్రం కౌంటింగ్ గేటు ముందు 100 మీటర్ల వరకు మాత్రం వాహనాలకు అనుమతి ఉందని చెప్పారు.



కలెక్టరేట్ నుంచి పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తున్న దృశ్యం



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కౌంటింగ్ కేంద్రానికి చేరిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు

జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు సంబంధించిన బాక్స్‌లను నెల్లూరు కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌కు చేర్చారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో భారీ బందోబస్తు నడుమ ఈ బాక్సులను ప్రియదర్శిని కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చి భద్రపరిచారు. నెల్లూరు పార్లమెంట్‌కు సంబంధించి కలెక్టరేట్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్‌లను కూడా డీఆర్‌ఓ లవన్న సమక్షంలో ప్రియదర్శిని కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చి భద్రపరిచారు.

నిఘా నీడలో కౌంటింగ్

నెల్లూరు రూరల్ నియోజకవర్గం కనపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి సోమవారం పోలీసు సిబ్బంది చేరుకున్నారు. పటిష్ట భద్రత మధ్య ఓట్ల లెక్కింపును చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. ప్రవేశద్వారం వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ట్రెయినీ డీఎస్పీ హేమలత సూచనలిచ్చారు. కేంద్రంలోకి వెళ్లే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేయాలని ఆమె తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు ఉంచేలా చూడాలన్నారు. మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేసేందుకు కౌంటర్లు పెట్టారు.

– నెల్లూరు(క్రైమ్)/సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ట్రైనీ డీఎస్పీ హేమలత



కౌంటింగ్ కేంద్రం బయట ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్


తనిఖీ ఎలా చేయాలో సిబ్బందికి చెబుతూ..


కౌంటింగ్ విధులకు వచ్చిన పోలీస్ సిబ్బంది


సేఫ్టీ జాకెట్, హెల్మెట్ తీసుకెళ్తున్న సిబ్బంది


భోజనాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది


కౌంటింగ్ ర్యాక్‌లు తీసుకెళ్తున్న దృశ్యం


కేంద్రానికి చేరుకున్న స్పెషల్ పార్టీ పోలీసులు



మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేసేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్లు

వేలం కేంద్రంలో కొండచిలువ

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం కొండచిలువ కలకలం రేపింది. పొగాకు వేలం జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా ఏడు అడుగుల పొడవైన పాము కనిపించడంతో రైతులు, అధికారులు భయాందోళనకు గురయ్యారు. తర్వాత కొందరు దానిని చంపివేశారు.

కానిస్టేబుల్ దౌర్జన్యం చేశాడని ఫిర్యాదు

ఉలవపాడు: బాటిల్లో పెట్రోల్ పోయ లేదని తనపై కానిస్టేబుల్ దౌర్జన్యం చేశాడని మన్నేటికోట రోడ్డులోని బీపీసీఎల్ పెట్రోలు బంకు సిబ్బంది మద్దిరాల కృష్ణప్రసాద్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులోని వివరాల మేరకు.. ఓ వ్యక్తి ఆదివారం రాత్రి బాటిల్లో పెట్రోల్ కావాలని వచ్చాడని, అలా ఇచ్చేది లేదని చెప్పడంతో, తాను కానిస్టేబుల్‌నని దౌర్జన్యం చేశాడని కృష్ణప్రసాద్ వాపోయాడ. సీసీ టీవీ ఫుటేజీ ఉందని, కానిస్టేబుల్‌ను గుర్తించి అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రతి పత్రం ఎంతో కీలకం

సీతారామపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికార యంత్రాంగం అనేక ఫారాలు వినియోగిస్తుంది. వీటిల్లో ప్రతి దానికి ప్రాధాన్యం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒకేసారి చేపడుతున్నారు. ఫలితాల బటన్ నొక్కగానే ప్రతి అభ్యర్థికీ పోలైన ఓట్లు ఈవీఎంలో కనిపిస్తాయి. ప్రతి రౌండ్ లెక్కింపునకు ముందు కౌంటింగ్ ఏజెంట్లతో 17సీ ఫారంలో తప్పనిసరిగా సంతకాలు తీసుకుంటారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఫారం–20లో నమోదు చేసి కంట్రోల్‌రూం, మీడియా కేంద్రాలకు తప్పనిసరిగా పంపిస్తారు. సువిధ యాప్‌లో నమోదు చేసిన తర్వాత మాత్రమే రౌండ్లవారీ ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తారు.

ఫారం–18 : ఎన్నికల రిటర్నింగ్ అధికారి జారీచేసిన ఈ ధ్రువీకరణపత్రం ఉంటేనే అభ్యర్థుల ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు.

అనెగ్జర్–38 : ఓట్ల లెక్కింపునకు నియమితులైన పర్యవేక్షకులు, సహాయకులకు జారీచేసే ధ్రువీకరణ పత్రం.

అనెగ్జర్–ఏ : ఎంపిక చేసిన ఐదు వీవీ ప్యాట్‌ల వివరాలుంటాయి.

అనెగ్జర్–బీ : వీవీ ప్యాట్లలోని స్లిప్పుల లెక్కింపు తర్వాత ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎన్నికల పరిశీలకుడు ధ్రువీకరించే పత్రం.

ఫారం–21సీ : ఓట్ల లెక్కింపు అనంతరం వెంటనే ఫలితాలు దీనిలో నమోదు చేస్తారు.


ఓట్లు వేసేందుకు క్యూలో ఉన్న ప్రజలు (ఫైల్)

ఫారం–21ఈ : నియోజకవర్గంలో ఏ పార్టీకి అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయి?, ఎవరు విజయం సాధించారనే సమగ్ర వివరాలు ఇందులో ఉంటాయి.

ఫారం–22 : విజయం సాధించిన అభ్యర్థికి ఎన్నికల అధికారి జారీచేసే ధ్రువీకరణపత్రం. దీని ద్వారానే చట్టసభల్లో సభ్యులుగా ఎంపికవుతారు.

అనెగ్జర్–58 : పార్ట్–1లో పోలింగ్‌బూత్‌ల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల వివరాలు ఉంటాయి. పార్ట్–2లో పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపు, ఆధిక్యం, ఫలితాల వివరాలుంటాయి.

అనెగ్జర్–39 : దీనిలో తుది ఫలితం వివరాలు సమగ్రంగా ఉంటాయి. పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల ఆధిక్యతలో నోటాతో సహా పొందుపరుస్తారు.

ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా లోగో

ఆర్వో సంతకం చేసిన తర్వాత దీనిని అధికారికంగా విడుదల చేస్తారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

• ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనున్న నేపథ్యంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లా అంతా ఆరో తేదీ వరకు 144 సెక్షన్ ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకుని సంయమనం పాటిస్తూ ఘర్షణలు, వివాదాలకు దూరంగా ఉండాలని ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరిగేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న ఎస్పీ

విశ్రాంత ఉపాధ్యాయుడి దేహ, నేత్ర దానం

నెల్లూరు(అర్బన్): విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీరాములు వయోభారంతో సోమవారం మృతి చెందారు. ఆయన నేత్రాలు, దేహాన్ని కుమార్తెలు దానం చేశారు. ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు మండలం వినోదరాయునిపాళేనికి చెందిన శ్రీరాములుకు ముగ్గురు కుమార్తెలు. భార్య కొన్ని సంవత్సరాల క్రితం మరణించారు. కుమార్తెలు సింగమనేని విజయలక్ష్మి, సింగమనేని లక్ష్మి, బెజవాడ శివకుమారి నెల్లూరులో స్థిరపడ్డారు. శ్రీరాములు వారి వద్ద ఉంటున్నాడు. తన మరణానంతరం నేత్ర, దేహ దానం చేయాలని కుమార్తెలను కోరారు. దీంతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి శ్రీరాములు నేత్రాలను దానం చేశారు. మృతదేహాన్ని నారాయణ మెడికల్ కళాశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసైన్స్ వేదిక నాయకుడు డాక్టర్ జీ విజయకుమార్ మెమోరియల్ ట్రస్ట్ సభ్యుడు గాలి శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీరాములు ధన్యజీవి అయ్యాడన్నారు. ఈ నేత్ర, దేహదానానికి న్యాయవాది బ్రహ్మం సహకరించారు.


శ్రీరాములు (ఫైల్)

నోడల్ ఆఫీసర్‌గా ఆదిశేషయ్య



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్‌గా ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్యను సీఎండీ సంతోషరావు నియమించారు. సోమవారం నెల్లూరుకు వచ్చిన ఆయన కేంద్రంలో ఏర్పాట్ల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో నిరంతరం విద్యుత్ సరఫరాకు ఇప్పటికే జిల్లా ఎస్ఈ విజయన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారన్నారు. పలువురు విద్యుత్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉన్నారని, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అందరం సరఫరా పనులు పర్యవేక్షిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో చిన్న అంతరాయం కలగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని తన నివాసంలో సోమవారం సాయంత్రం ఆయన ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు పార్లమెంట్ స్థానంతోపాటు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని పేర్కొన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు చాలా కీలకమని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


ఏజెంట్లకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

‘రంగడి’ ఆలయంలో వసంతోత్సవాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): నగరంలో రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామివారి దేవస్థానంలో వసంతోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉభయదేవేరులతో కొలువైన స్వామివారికి వేదపండితులు ప్రథమంగా నవకలశ స్నపన తిరుమంజనం, అనంతరం విశేష పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీవారి ప్రాకారోత్సవం కనులపండువగా జరిగింది. ఉభయ కర్తలుగా డాక్టర్ సి.విజయసారథి వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి


ఘటనా స్థలంలో ఇలా..


తారిఫ్ మృతదేహం

• ఇద్దరికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో కంటైనర్ లారీ వేగంగా ఢీకొంది. దీంతో కంటైనర్ డ్రైవర్ మృతిచెందగా, క్లీనర్, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన నెల్లూరులోని కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. సౌత్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. ఢిల్లీ నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనర్ లారీ సోమవారం తెల్లవారుజామున కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు వద్ద ముందు వెళ్తున్న లారీని ఎడమవైపు ఓవర్‌టేక్ చేసే క్రమంలో వేగంగా ఢీకొంది. దీంతో కంటైనర్ డ్రైవర్ రాజస్థాన్‌కు చెందిన తారిఫ్ (24)కు తీవ్రగాయాలయ్యాయి. మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి సౌత్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తారిఫ్ చనిపోయాడు. మృతదేహాన్ని సౌత్ ట్రాఫిక్ ఎస్సై రాజేష్ పరిశీలించారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.25



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 154
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 300
లేయర్ చికెన్	: 204



సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
NALANDA C.B.S.E. SCHOOL
Affiliated to CBSE New Delhi
Gayathri Nagar, Kavali, SPSR Nellore (Dt)
Wanted Principal, Vice Principal, and all Subjects Teachers with minimum 3 years Experience in CBSE Schools.
Good Salary, Free Boarding and Lodging will be provided
INTERVIEW DATE 05-06-2024 9.00 to 12:30 PM
Contact Immediately 99498 49758, 87900 27909 91210 24992, 96181 52478

NELCAST LIMITED
Requires Fresh Engineering Graduates For The Post of "Graduate Engineer Trainees " (GETs).
Qualification : BE Mech. / EEE
Passed Out 2023 / 2024 Batch
Location : Gudur / Pedapariya / Ponneri.
Interested Candidates may Please Forward to their Updated Resumes to pm@nelcast.com & gp@nelcast.com within a week.

WANTED...WANTED...WANTED...
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెల్లూరు టౌన్ బ్రాంచిల నందు రికవరి ఎగ్జిక్యూటివ్స్‌గా పని చేయుటకు Experienced మరియు Freshers నుండి దరఖాస్తులను కోరడమైనది.
Qualification : Any Degree Age : 30సం॥లోపు
Salary : నెలకు 18,000/- (C.T.C.) ఆపైన అనుభవం అనుసరించి.
Incentives : 25,000/- వరకు ఇన్సెంటివ్స్ కలవు.
ద్విచక్ర వాహనం తప్పనిసరిగా కలిగియుండవలెను.
ఇంటర్వ్యూ తేది : 06.06.2024, సమయం : 10AM to 2PM
ఆసక్తి కలిగిన అభ్యర్థులు మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది అడ్రస్ నందు నేరుగా సంప్రదించగలరు.
Adress : SHRIRAM FINANCE LIMITED
16/537, UPSTAIRS OF BANK OF BARODA
INDIRA BHAVAN ROAD, NELLORE.
Contact: K. Gandaiah, Cluster Head-70135 63094
S.V.Subbaiah, Cell :8790964446

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DIRECT FINAL YEAR
■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/lateral entry.9381287629 [T-2096]
■డైరెక్ట్ 10th ఒకే సం॥లో ఇంటర్, B.Tech, M.Tech, MBA, MCA, M.Sc, M.Com, MA, MLisc, BLisc, BCA, B.Sc, BBA, B.Com, BA, Paramedical, Phd, B.Voc, M.Voc, RIPS, Nellore @ 80080 10144. [NA-5371]

REAL ESTATE
LAND FOR SALE
■కాకుపల్లి సెంటర్ నుండి 2 Km దూరంలో 3 ఎకరాల పొలం, ఫామ్ హౌస్‌తో పాటు అమ్మబడును. సంప్ర : 70362 31356. [NA-23464]
PLOT FOR SALE
■నవాబుపేట మైపాడుగేట్ సెంటర్ దగ్గరలో అపార్ట్‌మెంట్స్, స్కూల్స్, కళ్యాణ మండపంలకు అనువైన 220 అం॥ స్థలం అమ్మబడును. సెల్ : 83093 04379. [NA-23463]
TO-LET
■నెల్లూరు నవాబుపేట మెయిన్‌రోడ్, 2టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గరలో, ఆఫీసులకు, బ్యాంకులకు అనువైన 1800Sft బిల్డింగ్ పూర్తిగా లేక సగభాగం అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి: 99496 17550, 98486 51885. [NA-6429]

WANTED
■Required Teachers From Pre Primary to High School, Experienced as Well Freshers Can Opt. Contact : 8074897787. [NA-23469]
■Wanted Teachers to Teach 3rd - 7th Class. All Subjects. Cont: Priyanka E.M School, Mulapet Gate Centre, Nellore. Cell : 73826 04745. [NA-2655]
■Wanted Immediately : Vice Principal, High School. English, Computer & Office Boy. Location Balaji Nagar, Nellore. Cell : 91777 61633, 99894 33348. [NA-6437]
■Wanted Teachers in High School for Telugu Hindi, English and Biology. Primary Teachers for Telugu, Hindi, Maths and Social. Contact: Sage school, kakupalli. Cell : 91105 72349, 93924 31909. [NA-6436]
■ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 95026 15217 [M-1185203]
■BMG సెక్యూరిటి సంస్థలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. రూమ్ ఫ్రీ, భోజనం ఫ్రీ, సెక్యూరిటీ గార్డ్‌కు 11000/- ASOకు 15000/-. సంప్ర : 82470 89070. [NA- 5374]
■డ్రైవర్స్ : నెల్లూరు పరిసరాలలో మా స్కూలు బస్సు / వ్యాను నడిపేందుకు లైసెన్సు కలిగిన డ్రైవర్స్ కావలెను. వివరములకు సంప్రదించండి: 94402 66743. [NA-2635]
■బ్యాంక్ లోన్స్ ప్రాసెస్ నందు Telecaller కావలెను. Married Female, టార్గెట్స్ లేవు. జీతం: 12000/-. ట్రంకురోడ్, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 88858 02000. [NA-23456]
■వాటర్ ప్లాంట్ నందు హెల్పర్లుగా పనిచేయుటకు స్త్రీ/పు కావలెను. 12K-15K జీతం. 12గం॥ల డ్యూటీ. ఉచిత వసతి కలదు. వివరములకు సంప్రదించండి: 91820 08306. [NA-23443]
■యూనివర్సిటీజిరాక్స్,గాంధీబొమ్మ వద్ద ట్రంకు రోడ్డు నందు పని చేయుటకు కంప్యూటర్, జిరాక్స్ ఆపరేటర్ కావలెను. అనుభవం అవసరం లేదు. యువతి, యువకులు. సంప్ర: 98481 54861. [NA-606]
■ముత్తుకూరు స్రవంతి రెస్టారెంట్లో పనిచేయుటకు మంచి అనుభవం కలిగిన ఇండియన్ చైనీస్ వంటమాస్టర్ కావలెను. జీతం : 40,000/- + రూమ్ + భోజనం కలదు. ఫోన్ : 83099 15445 [V- 6324]
■కన్సల్టెన్సీకాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పు,ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP&డాక్టర్స్ కావలెను. జీ:15000 - 40000,ఫ్రీ రూం+భోజనం. Hyd. 7993583999 [HA-196]
■ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, వంట/ఇంటి పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 20K. Ph: 8977639622, 8977639663 [HA-197]
■కెప్టెన్, సప్లయర్స్, పార్సిల్ ప్యాకింగ్ వర్కర్స్, స్టోర్ కీపర్, క్యాషియర్, కంప్యూటర్ ఆపరేటర్, సూపర్‌వైజర్స్, క్లీనర్స్ కావలెను. అనుభవము బట్టి జీతం. శ్రీ దుర్గా హోటల్, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు. 95507 10248, 95437 58005. [NA-5375]
■కావలి IAS స్కూలు నందు పని చేయుటకు ప్రైమరీ కి,హైస్కూలుకు అనుభవం కల్గిన టీచర్లు మరియు వార్డెన్లు, వంట మనుషులు, హెల్పర్లు కావలెను. మంచిజీతం ఇవ్వబడును. సంప్రదించండి : 94936 64833,79970 57107. [NA-1246112]
■లేడీ ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. Qualification : DMLT/B.Sc, 2సం॥అనుభవం Contact: Dr.S.Andal లక్ష్మీఫెర్టిలిటీ సెంటర్,S2 సినిమా హాల్స్ దగ్గర, పొగతోట, నెల్లూరు. సంప్రదించండి: 99088 54316, 0861-2328914. [NA-2654]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.